సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం । 1 । జూన్ । 2023



సచివాలయ ఉద్యోగుల హర్షం

మూడేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న సచివాలయాల ఉద్యోగులకు ప్రభుత్వం బదిలీలకు అవకాశం కల్పించడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. 8లో ▸



కృష్ణ సేవలు ఎనలేనివి

ఏలూరులో ఏర్పాటుచేసిన కృష్ణ విగ్రహాన్ని బుధవారం ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆవిష్కరించారు. తెలుగు చిత్రసీమకు కృష్ణ చేసిన సేవలను కొనియాడారు. 8లో ▸

శ్రీవారి ఏకాదశి ఉత్సవం



ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న ఏకాదశి ఉత్సవం వేడుకగా జరిగింది. శ్రీవారి ఊరేగింపు క్షేత్ర పురవీధుల్లో అట్టహాసంగా నిర్వహించారు. భక్తులు అడుగడుగునా నీరాజనాలు అర్పించారు.

న్యూస్‌రీల్

20 రోజులు.. రూ.2.32 కోట్లు

చిన వెంకన్న హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయ హుండీల ఆదాయాన్ని బుధవారం స్థానిక ప్రమోద కల్యాణ మండపంలో లెక్కించారు. 20 రోజులకు నగదు రూపంలో రూ.2,32,56,651, కానుకల రూపంలో 442 గ్రాముల బంగారం, 6.572 కిలోల వెండితో పాటు అధికంగా విదేశీ కరెన్సీ లభించాయని ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు. అలాగే లెక్కింపులోకి రాని రద్దయిన పాత రూ.1,000, రూ.500 నోట్ల ద్వారా రూ.15,500 లభించాయన్నారు. ఆలయ ట్రస్టుబోర్డు సభ్యురాలు ఆచంట అనసూయ, సురేష్ దంపతులు పాల్గొన్నారు.

కేంద్ర స్కాలర్‌షిప్‌నకు ఆనందిత ఎంపిక



నరసాపురం: నరసాపురంలోని రాయిపేటకు చెందిన దామెర్ల ఆనందిత కేంద్ర ప్రభుత సాంస్కృతిక శాఖ ఆధీనంలోని సీసీఆర్‌డీ (సెంటర్‌ఫర్ కల్చరల్ రిసోర్సెస్ అండ్ ట్రెనింగ్) స్కాలర్‌షిప్‌నకు ఎంపికయ్యింది. దేశంలోని వివిధ రాష్ట్రాలకు సంబంధించిన ప్రాంతీయ కళలను ప్రోత్సహించేందుకు, ఆయా కళల్లో రాణిస్తున్న, తర్ఫీదు పొందుతున్న వారికి కేంద ప్రభుత్వం ఏటా స్కాలర్‌షిప్ అందిస్తోంది. 2021–22కి గాను బుధవారం జాబితా ప్రకటించిగా భరతనాట్యం (కూచిపూడి) విభాగంలో ఆనందితకు స్థానం దక్కింది. దేశంలో 11 మంది ఎంపిక కాగా గోదావరి జిల్లాల నుంచి ఆనందిత ఒకరు. ఈ ఏడాది 10వ తరగతి ఉత్తీర్ణురాలైన ఆనందిత తల్లి కనక విజయలక్ష్మి స్వీయ శిక్షణలో నాట్యంలో రాణిస్తోంది. ఇప్పటివరకూ 200 వరకు ప్రదర్శనలు ఇచ్చింది. నాట్యంలో రాణిస్తూ, సైంటిస్ట్ కావాలనేది ఆనందిత కోరిక అని తండ్రి రాంబాబు అన్నారు. ఆనందిత తల్లి కనకవిజయలక్ష్మి 40 ఏళ్లుగా కూచిపూడి నాట్యాచారిణిగా ఉన్నారు. స్థానికంగా నటరాజ కూచిపూడి డ్యాన్స్ అకాడమీ నడుపుతూ కళాకారులను తయారుచేస్తున్నారు. ఆమె జాతీయ, అంతర్జాతీయ వేదికలపై ప్రదర్శనలు ఇచ్చారు. ఆనందితను ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అభినందించారు.

ఘనంగా భూదేవి పండుగ



రేల నృత్యాలు చేస్తున్న మహిళలు

బుట్టాయగూడెం: పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలోని గిరిపల్లెల్లో తొలకరి వేళ ఆదివాసీ గిరిజనులు జరుపుకునే భూదేవి పండుగను బుధవారం మండలంలోని బూసరాజుపల్లి సమీపంలో ఉన్న ఐటీడీఏ క్వార్టర్స్‌లో ఘనంగా నిర్వహించారు. గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాన్ని చాటేలా వేడుకలు జరిగాయి. తొలి రోజు ఇరక కొమ్మ, రేలపూలు తెచ్చి పూజలు చేయడం, కోడిని కర్రకు కట్టి భుజాలపై ఎత్తుకుని పొలిమేర చుట్టూ మూడుసార్లు కొలేరి వేట తిరిగిన అనంతరం గ్రామ పెద్దల సమక్షంలో కోడిని కోసి నంజోడి చేయడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. గిరిజన సంప్రదాయ నృత్యాలు చేసి సంప్రదాయ సహపంక్తి భోజనాలు చేశారు. పురుషులను మరదళ్లు, వదినలు, నాయినమ్మలు పేడతో కొట్టి అడవికి వేటకు తరమడం వంటివి ఆకట్టుకుంటున్నాయి. పెద్ద కాపులు కుర్సం దుర్గారావు, తెల్లం గంగరాజు, జలగం రాంబాబు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. తొలకరి నుంచి దుక్కులు దున్ని పంటలు వేసే వరకూ మన్య ప్రాంతంలో భూదేవి పండుగ వేడుకలను గిరిజనులు జరుపుకుంటారు.

అద్దెకు వాహనాలపై టెండర్ల ఆహ్వానం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు జిల్లాలో రవాణా శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు వినియోగించడానికి నెలవారీ అద్దె ప్రాతిపదికన మూడు కొత్త మోడల్ మారుతి డిజైర్ వాహనాలు కావాలని ఉప రవాణా కమిషనర్ కె.శ్రీహరి ఓ ప్రకటనలో తెలిపారు. నెలవారీ అద్దెగా రూ.35 వేలు చెల్లిస్తామని, ఇంధనం, డ్రైవర్ జీత భత్యాలు, వాహన నిర్వహణ, ఇతర ఖర్చులన్నీ యజమానులు భరించాలని పేర్కొన్నారు. ఈనెల 7లోపు దరఖాస్తులను తమ కార్యాలయంలో సమర్పించాలని, అదేరోజు సాయంత్రం 4 గంటలకు టెండర్లు తెరుస్తామని తెలిపారు.

బడి గంటకు ముందే..

జగనన్న విద్యా కానుక సిద్ధం

- పుస్తకాలు, విద్యాసామగ్రి వచ్చేశాయ్
- నూరు శాతం ఇండెంట్ మంజూరు
- 5 నుంచి పాఠశాలలకు సరఫరా



భీమవరంలో పుస్తకాలను పరిశీలిస్తున్న విద్యాశాఖ అధికారులు

ఆకివీడు: గణగణమంటూ బడి గంట మోగక ముందే విద్యా సామగ్రి సిద్ధమైంది.. పాఠశాలలు తెరిచిన నాడే విద్యార్థులందరికీ జగనన్న విద్యా కానుక అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 12న పాఠశాలలు తెరువనున్న నేపథ్యంలో 5వ తేదీ నాటికి విద్యా కానుక సామగ్రిని బడులకు చేర్చేలా కార్యాచరణ అమలు చేస్తున్నారు. జిల్లాలోని 1,388 పాఠశాలల్లోని 1,13,580 మంది విద్యార్థులకు పూర్తి స్థాయిలో యూనిఫాంలు, బ్యాగ్‌లు, టై, బెల్టులు తదితర సామగ్రిని సిద్ధం చేశారు. ఈ మేరకు జిల్లాకు నూరుశాతం ఇండెంట్ ప్రకారం విద్యా కానుక సామగ్రి వచ్చింది. రాష్ట్రంలో విద్యా విప్లవానికి శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుస్తున్నారు. దీనిలో భాగంగా నాడు–నేడు కార్యక్రమంలో పాఠశాలల భవనాలను సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నారు. అలాగే సర్కారీ బడుల్లోని విద్యార్థులు కార్పొరేట్ విద్యార్థులకు దీటుగా ఉండేలా యూనిఫాం, టై, బెల్ట్, షూస్ అందిస్తున్నారు. దీంతో బడుల ప్రారంభం నుంచే పాఠశాలల్లో సందడి కనిపించనుంది. గతంలో ఎన్నడూలేని విధంగా విద్యాసామగ్రి అందించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

పాఠశాలల్లో చేరేందుకు ఉత్సాహం

ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు విద్యార్థులు ఉత్సాహం చూపుతున్నారు. వేసవి క్యాంపెయిన్‌గా వలంటీర్లు, ఉపాధ్యాయులు ప్రైవేట్ స్కూళ్లలో చదివే విద్యార్థులు, బడికి రాని పిల్లలు ఇంటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని అవగాహన కల్పిస్తున్నారు. గతానికి ఇప్పటికీ ప్రభుత్వ బడుల్లో వచ్చిన మార్పులను వివరించడంతో విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. మండల పరిషత్ పాఠశాలల్లో చేరేందుకు కొన్ని ప్రాంతాల్లో అదనంగా 50 నుంచి 70 మంది వరకు పిల్లలు సుముఖత వ్యక్తం చేస్తున్నారని ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

నాణ్యంగా.. ఆకర్షణీయంగా..

జగనన్న విద్యా కానుక కిట్‌లోని సామగ్రి నాణ్యతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. జిల్లా కేంద్రాలకు వచ్చిన యూనిఫాం, బ్యాగులు, షూలు, బెల్ట్‌ల నాణ్యతను విద్యాశాఖ, సర్వశిక్ష అభియాన్ అధికారులు పరిశీలించి వాటిని ఆయా పాఠశాలలకు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

సామగ్రి రకం	ఇండెంట్	మంజూరు
యూనిఫాంలు	1,13,580	1,13,580
నోట్ పుస్తకాలు	7,24,466	7,24,466
బెల్ట్‌లు	78,474	78,474
ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు	13,270	13,270
షూస్ (జతలు)	1,13,431	1,13,431
బ్యాగ్స్	1,13,584	95,285
పిక్టోరియల్ డిక్షనరీలు	8,672	8,672
టెక్ట్స్‌బుక్స్	13,41,939	13,41,939

అన్ని చర్యలు తీసుకున్నాం



పాఠశాలలు ప్రారంభించడానికి (12వ తేదీ) ముందే జగనన్న విద్యా కానుక కిట్‌లను ఆయా పాఠశాలలకు తరలించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈనెల 5వ తేదీ నుంచి బడులకు సరఫరా మొదలుపెడతాం. జిల్లాకు ఇండెంట్ మేరకు పూర్తిస్థాయిలో విద్యా సామగ్రిని ప్రభుత్వం అందజేసింది.

– డి.వెంకటరమణ, జిల్లా విద్యాశాఖాధికారి, భీమవరం

నూరు శాతం సరఫరా



ఈ విద్యా సంవత్సరం ఆరంభానికి ముందే ఆయా పాఠశాలలకు విద్యా సామగ్రి, యూనిఫాంలు, బ్యాగ్‌లు, షూ, టై, బెల్టు, పుస్తకాలు నూరుశాతం అందుబాటులోకి తెచ్చాం. విద్యార్థులు యూనిఫాంలు వేసుకుని ప్రభుత్వ బడులకు రానున్నారు. నోటు, వర్కు, పాఠ్య పుస్తకాలను కూడా అందుబాటులో ఉంచాం.

– పి.శ్యామ్‌సుందర్, అదనపు ప్రాజెక్టు కో–ఆర్డినేటర్, సర్వశిక్ష అభియాన్, పశ్చిమగోదావరి

నేడు కాలువలకు నీరు విడుదల



భీమవరం వద్ద జీఅండ్‌వీ కెనాల్ (ఫైల్)

సాక్షి, భీమవరం: ముందస్తు సార్వా సాగుకు వీలుగా ప్రభుత్వం ప్రకటించిన విధంగా జూన్ 1న కాలువలకు నీరు విడుదల చేయనుంది. గురువారం ఉదయం ధవళేశ్వరం వద్ద నీటిని విడుదల చేయనున్నారు. అయితే ఒకేసారి పెద్ద మొత్తంగా కాకుండా ముందుగా 500 క్యూసెక్కులు విడుదల చేసి, తర్వాత ప్రతిరోజూ పెంచేలా అధికారులు చర్యలు తీసుకున్నారని జిల్లా జలవనరుల శాఖ అధికారి పి.నాగార్జునరావు తెలిపారు. కాలువల శివారు ప్రాంతాలకు నీరు చేరడానికి నాలుగైదు రోజుల సమయం పట్టవచ్చన్నారు. వేసవిలో కాలువ అభివృద్ధి పనులు చేసిన దృష్ట్యా ఒకేసారి నీరు విడుదల చేస్తే గట్లు దెబ్బతినే ప్రమాదం ఉందని అన్నారు.

సార్వాకు సన్నద్ధం

గత సార్వా సీజన్‌లో వర్షాలు సకాలంలో కురవకపోవడం, నాట్లు వేసే సమయంలో భారీ వర్షాలు కురవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. అలాగే దాళ్వా సీజన్‌లో వాతావరణం అనుకూలించి పైరు ఏపుగా పెరిగిన సమయంలో అకాల వర్షాలు రైతులను ఇబ్బంది పెట్టాయి. ఈ నేపథ్యంలో సార్వా సాగు ముందస్తుగా చేపట్టాలని వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. దీనికి అనుగుణంగా కాలువలకు ముందుగానే నీటిని విడుదల చేయడంతో రైతులు సార్వా సాగుపై దృష్టి పెట్టే అవకాశం ఏర్పడింది.

వృద్ధులను ప్రేమతో ఆదరించాలి



చినఅమిరంలో వృద్ధాశ్రమ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పినిపే విశ్వరూప్

భీమవరం అర్బన్: పిల్లల ఆదరణకు నోచుకోని వృద్ధులు ఉన్నారని, ప్రతిఒక్కరూ వృద్ధులను ఆదరించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. మండలంలోని చినఅమిరం గ్రామంలోని తబిత డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో అత్యాధునిక వసతులతో నిర్మించిన వృద్ధాశ్రమాన్ని బుధవారం జాయింట్ కలెక్టర్ ఎస్.రామ సుందర్‌రెడ్డితో కలిసి మంత్రి పినిపే విశ్వరూప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ నిర్వాహకులు వృద్ధులకు సకల సౌకర్యాలతో అత్యాధునికంగా మరో వృద్ధాశ్రమాన్ని నిర్మించి తనతో ప్రారంభింపజేయడం ఆనందంగా ఉందన్నారు. అన్నార్తులకు వృద్ధాశ్రమాలు ఆలయాలని అత్యాధునిక వసతులతో వృద్ధాశ్రమాన్ని నిర్మించిన చిలుకూరు నరసింహరాజు, నిర్వాహకులు బీహెచ్ లక్ష్మిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. జేసీ రామసుందర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో దాతలకు కొదవ లేదని మరిన్ని ప్రాంతాల్లో వృద్ధాశ్రమాలు ఏర్పాటు చేస్తే బాగుంటుందన్నారు. ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు, అడిషనల్ జిల్లా ఎస్పీ ఏవీ సుబ్బరాజు, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు, భీమవరం హాస్పటల్స్ ఎండీ గాదిరాజు గోపాలకృష్ణంరాజు, శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, డొక్కు సోమేశ్వరరావు, ఇందుకూరి ఆంజనేయరాజు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న పాల వెల్లువ'తో రైతులకు మేలు



మాట్లాడుతున్న పశు సంవర్ధకశాఖ అధికారి

యలమంచిలి: జగనన్న పాల వెల్లువ కేంద్రాలతో పాడి రైతులకు లాభం, గౌరవం లభిస్తుందని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి కె.మురళీకృష్ణ అన్నారు. మేడపాడు, చించినాడ గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో బుధవారం ఆయన పాడి రైతులతో సమావేశమయ్యారు. జగనన్న పాల వెల్లువ కేంద్రాల్లో పాలు పోసే రైతులకు లీటరు పాలకు రూ.86 వరకు అత్యధిక ధర ఇస్తారన్నారు. పాలు పోసే రైతులకు రాయితీపై దాణా, పశువుల కొనుగోలుకు రుణ సహాయం, పశువుల ఆరోగ్య రక్షణకు సత్వర వైద్యం వంటివి అందిస్తున్నారన్నారు. ప్రతి పది రోజులకోసారి పాల బిల్లులు జమచేస్తున్నామన్నారు. రూ.384 చెల్లిస్తే మూడేళ్లపాటు పశువుకు రూ.30 వేల బీమా పథకం వర్తిసుందన్నారు. మేడపాడు సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ గుర్రాల వెంకట్రావు, ఎంపీటీసీ సభ్యురాలు డేగల సూర్యప్రభ, పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకుడు జవార్ హుస్సేన్, సహాయ సంచాలకుడు మేడా రామశేఖర్, యలమంచిలి, దొడ్డిపట్ల పశు వైద్యశాలల వైద్యులు దొమ్మేటి మాధురి, పోరెడ్డి చంద్రశేకరరెడ్డి, ఏపీఎం మళ్ల సోని, గ్రామ కార్యదర్శి మాధురి పాల్గొన్నారు.

'స్పందన' ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యం

డీపీఓ మల్లికార్జునరావు



గ్రామ కార్యదర్శులతో మాట్లాడుతున్న డీపీఓ

తణుకు టౌన్: గ్రామాల్లో పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా, విద్యుత్ వంటి వాటితో స్పందనలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి గ్రామ కార్యదర్శులు ప్రాధాన్యమివ్వాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) జీవీకే మల్లికార్జునరావు అన్నారు. తణుకు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయన గ్రామ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో స్పందన ఫిర్యాదులకు సంబంధించి పెండింగ్ వివరాలను అందించాలని కోరారు. తణుకు మండలంలో కోర్టు కేసుల వివరాలపై ఆరా తీశారు. త్వరలో రానున్న 15వ ఆర్థిక సంఘం నిధుల చెల్లింపులకు సంబంధించి ముందస్తు చర్యలకు గ్రామ కార్యదర్శుల నుంచి వివరాలు సేకరిస్తున్నామన్నారు. జిల్లాలో ఖాళీగా వున్న గ్రేడ్–1 గ్రామ పంచాయతీ కార్యదర్శుల పోస్టుల భర్తీకి గ్రేడ్–2 కార్యదర్శులకు పదోన్నతులు కల్పిస్తున్నట్టు చెప్పారు. స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డులకు సంబంధించి జిల్లాలోని 15 గ్రామ పంచాయతీల్లో జూన్ 1వ తేదీ నుంచి సర్వే నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఎంపీడీఓ టీఎస్ మూర్తి, ఈవోపీఆర్డీలు రామ్‌ప్రసాద్, కృష్ణమోహన్ పాల్గొన్నారు. అనంతరం ఆయన తణుకు రూరల్ మండలం తేతలిలో ఆయన పర్యటించారు. గ్రామంలో చెత్త సేకరణకు ఏర్పాటు చేసిన షెడ్‌ను పరిశీలించారు.

8న ఉప సర్పంచ్ ఎన్నిక

జిల్లాలోని వివిధ గ్రామ పంచాయతీల్లో ఖాళీగా ఉన్న గ్రామ ఉప సర్పంచ్ పదవులకు జూన్ 8న ఎన్నికలను నిర్వహించనున్నట్టు డీపీఓ మల్లికార్జునరావు తెలిపారు. ఆయా గ్రామ పంచాయతీల్లో నిర్వహించే ప్రత్యేక సమావేశం ద్వారా ఉప సర్పంచ్‌లను ఎన్నుకుంటారని తెలిపారు. జిల్లాలోని పెంటపాడు మండలంలో పెంటపాడు గ్రామ ఉప సర్పంచ్‌కు ఎన్నిక నిర్వహించనున్నట్టు చెప్పారు.

పొగాకు వ్యతిరేక దినోత్సవ ర్యాలీ

ఏలూరు టౌన్: పొగాకు నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏలూరులో పొగాకు వ్యతిరేక ర్యాలీని బుధవారం ఆర్డీఓ కె.పెంచల కిషోర్ జెండా ఊపి ప్రారంభించారు. ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో మానహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'మనకు ఆహారం కావాలి.. పొగాకు కాదు' నినాదంతో ప్రజలను చైతన్యవంతులను చేయడమే లక్ష్యమన్నారు. జిల్లా ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ పొగాకు పలు వ్యాధులకు ముఖ్య కారణమన్నారు. ఇన్‌చార్జి ప్రోగామ్ ఆఫీసర్ డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ ఏలూరు సర్వజన, ఏరియా ఆస్పత్రుల్లోపొగాకు మాన్పించు కేంద్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు. టోల్ ఫ్రీ నంబర్ 1800 425 2024కు కాల్ చేసి ఉచిత కౌన్సెలింగ్, చికిత్స పొందవచ్చని తెలిపారు. ర్యాలీలో రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ పి.శ్రీనివాసరావు, సైకియాట్రిస్ట్ సీహెచ్ వంశీకృష్ణ, డాక్టర్ ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన ఇసుక రీచ్‌లను గుర్తించాలి

జేసీ రామసుందర్‌రెడ్డి



భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలో నూతన ఇసుక రీచ్‌లను, డీసిల్టేషన్ పాయింట్లను గుర్తించాలని జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. భీమవరంలోని కలెక్టరేట్‌లో బుధవారం జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నూతన ఇసుక రీచ్‌లను, డీసిల్టేషన్ పాయింట్లను గుర్తించి ప్రతిపాదనలను జిల్లా ఇసుక కమిటీ సమావేశంలో ఉంచాలన్నారు. యలమంచిలి మండలంలోని అబ్బిరాజుపాలెం, లక్ష్మీపాలెం, నరసాపురం పరిధిలోని మాధవాయపాలెంలోని మూడు డీసిల్టేషన్ పాయింట్లకు ఏప్రిల్ 30తో గడువు ముగిసినందున, కాలపరిమితి పెంపునకు ప్రతిపాదనలు పరిశీలించి రివర్ కన్సర్వేటర్ ఈఈ ఉత్తరులను జారీచేయాలని సూచించారు. గత మార్చిలో నిర్వహించిన ఇసుక కమిటీ సమావేశంలో ఆమోదించిన పెనుగొండ మండలంలోని సిద్ధాంతం–1, 2, నడిపూడి–1, 2 కొత్త రీచ్‌లకు సంబంధించి చట్టబద్ధమైన క్లియరెన్స్ వెంటనే సమర్పించాలని జయప్రకాష్ పవర్ వెంచర్స్ డిస్ట్రిక్ట్ ఇన్‌చార్జిని జేసీ ఆదేశించారు. జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారి జి.జయప్రసాద్, రివర్ కన్జర్వేటర్ గోదావరి హెడ్ వాటర్ వర్క్స్ ఈఈ ఆర్.కాశీ విశ్వేశ్వరరావు, ఎస్‌ఈబీ అడిషనల్ ఎస్పీ ఏటీవీ రవికుమార్, డీపీఓ జీవీకే మల్లికార్జునరావు, ఎంవీఐ వెంకటరమణ, భూగర్భ జలాలు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులు, జై ప్రకాష్ పవర్ వెంచర్స్ జిల్లా ఇన్‌చార్జ్ సి.రాజారెడ్డి, జిల్లా కో–ఆర్డినేటర్ హరీష్‌రెడ్డి పాల్గొన్నారు.

సప్లిమెంటరీ పరీక్షలకు సర్వం సిద్ధం

- రేపటి నుంచి టెన్త్ అనుబంధ పరీక్షలు
- 45 కేంద్రాల్లో.. 10,258 మంది విద్యార్థుల హాజరు



భీమవరం పీఎస్ఎం గరల్స్ హైస్కూల్‌లో పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థినులు

సాక్షి, భీమవరం: జిల్లాలో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈనెల 2వ తేదీ నుంచి 10వ తేదీ వరకు జరిగే పరీక్షలకు 10,258 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఈ మేరకు జిల్లాలోని 20 మండలాల్లో 45 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశారు. పదో తరగతిలో నూరుశాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ప్రభుత్వం సప్లిమెంటరీ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించింది. జిల్లాలోని 309 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తూ ప్రధాన పరీక్షల్లో ఫెయిల్ అయిన 6,905 మంది విద్యార్థులకు రోజూ ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించారు. ఉపాధ్యాయులు దగ్గరుండి ఆయా సబ్జెక్టుల్లో విద్యార్థుల అనుమానాలను నివృత్తి చేస్తూ శ్రద్ధగా చదివించారు.

పక్కా ఏర్పాట్లు

జిల్లాలో 45 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశారు. వీటిలో 13 ఏ, 32 బీ సెంటర్లు ఉన్నాయి. పరీక్షల నిర్వహణకు 45 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 45 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 16 మంది కస్టోడియన్స్, మూడు ఫ్లయింగ్ స్క్వాడ్స్, ముగ్గురు రూట్ ఆఫీసర్స్, 552 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా పక్కాగా చర్యలు తీసుకుంటున్నారు.

13 నుంచి మూల్యాంకనం



జిల్లాలో శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష ఉంటుంది. జూన్ 10 తేదీన పరీక్షలు ముగియనుండగా.. 13వ తేదీ నుంచి వీరవాసరం ఎంఆర్‌కే జిల్లాపరిషత్ హైస్కూల్‌లో స్పాట్ వ్యాల్యూయేషన్ ప్రారంభమవుతుంది.

– ఆర్.వెంకటరమణ, జిల్లా విద్యాశాఖాధికారి, భీమవరం

'పోలవరం'లో చిరుత సంచారం



చిరుత పాదముద్రలు గుర్తించిన అధికారులు



సంచరించిన ప్రాంతాల వద్ద అటవీశాఖ అధికారులు

పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతంలో చిరుత పులి సంచారం కలకలం రేగింది. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో పాటు నీటి వసతి లేకపోవడంతో అభయారణ్యం ప్రాంతం నుంచి కొండ దిగి ప్రాజెక్టు ప్రాంతంలోని నీటి ఒడ్డుకు వచ్చింది. బుధవారం వేకువజామున 4 గంటల సమయంలో ప్రాజెక్టు స్పిల్ చానెల్ ప్రాంతంలోని 902 హిల్ ప్రాంతంలో చిరుత కానరావడంతో ప్రాజెక్టు కార్మికులు భయాందోళనలకు గురయ్యారు. ప్రాజెక్టు ప్రాంతంలో తిరుగుతున్న టిప్పర్ డ్రైవర్లు చిరుత వెళుతున్న దృశ్యాలను వీడియోలో చిత్రీకరించారు. చిరుత అటవీ ప్రాంతం నుంచి గోదావరి నదీ ఒడ్డుకు చేరుకుని నీరు తాగి మరో మార్గంలో కొండపైకి వెళ్లినట్టు చెబుతున్నారు. సమాచారం తెలుసుకుని పోలవరం అటవీశాఖ రేంజ్ అధికారి సిబ్బందితో వచ్చి ప్రాజెక్టు ప్రాంతంలో చిరుత కదలికలను, పాదముద్రలను గుర్తించారు. నదీ పరీవాహక ప్రాంతంలో జన సంచారం లేకపోవడంతో ఇటీవల అభయారణ్యం ప్రాంతం నుంచి పలు రకాల జంతువులు గోదావరి నది వరకు చేరుకుని నీరు తాగి వెళుతున్నట్టు చెప్పారు. ఇలానే చిరుత కూడా ఈ ప్రాంతానికి వచ్చిందని అటవీ రేంజ్ అధికారి దావిద్ రాజు తెలిపారు. ప్రాజెక్టు పనులు చేస్తున్న కార్మికులు అప్రమత్తం ఉండాలని అటవీ ప్రాంతంలో సంచరించవద్దని, మాంసాహార పదార్థాలను బహిరంగ ప్రదేశాల్లో పాడేయవద్దని, కట్టెల కోసం ఎవరూ అటవీ ప్రాంతంలోకి వెళ్లవద్దని సూచించారు. రిజర్వ్ ఫారెస్ట్ ఏరియాలోకి ఏ ఒక్కరూ వెళ్లరాదని కార్మికుల క్యాంపు కార్యాలయం వద్దకు వెళ్లి అధికారులు తెలియజేశారు. అలాగే చిరుత సంచరించిన ప్రాంతాలను కూడా వారు గుర్తించారు. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పీవీ మధుకర్, బీట్ ఆఫీసర్ డి.రాజేష్ ఉన్నారు.

క్లుప్తంగా

విత్తన షాపుల సీజ్



విత్తన దుకాణంలో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ డీఎస్పీ వెంకటేశ్వరరావు, అధికారులు

ఏలూరు టౌన్/నూజివీడు: రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రవిశంకర్ అయ్యనార్, ఏలూరు రీజనల్ విజిలెన్స్ అధికారి కరణం కుమార్ ఆదేశాల మేరకు బుధవారం జిల్లాలోని జంగారెడ్డిగూడెం, నూజివీడు, చింతలపూడి ప్రాంతాల్లో విత్తన షాపులపై విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. షాపుల్లోని రికార్డులు, విత్తన నిల్వలను పరిశీలించి, వీటిలో వ్యత్యాసాలను గుర్తించారు. జంగారెడ్డిగూడెంలోని శ్రీదేవి ఆగ్రో ఏజెన్సీ విత్తనాల షాపును తనిఖీ చేయగా ఆర్థిక నిల్వలకు, గోడౌన్ నిల్వలకు వ్యత్యాసం ఉందని అధికారులు తెలిపారు. సుమారు రూ.1.18 లక్షల విలువ గల 3.71 క్వింటాళ్ల కాయగూరలు, అపరాల విత్తనాలను సీజ్ చేశామన్నారు. నూజివీడులో అన్నదాత సీడ్స్ విత్తనాల షాపును తనిఖీ చేయగా ఆర్థిక నిల్వలకు, గోడౌన్‌లోని విత్తన నిల్వలకు వ్యత్యాసం ఉందని, ఈ షాపులో రూ.5.86 లక్షల విలువ గల 10.16 క్వింటాళ్ల కూరలు, మొక్కజొన్న విత్తనాలను సీజ్ చేశామని చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు. దాడుల్లో విజిలెన్స్ డీఎస్పీ ఎస్.వెంకటేశ్వరరావు, డీఈఈ పి.శ్రీనివాసన్, ఏఈ పి.సురేష్, ఏడీ కె.నాగరాజు, ఎస్సై పి.శ్రీధర్, ఏజీ సీహెచ్ రంజిత్‌దూర్, మండల వ్యవసాయ అధికారులు ఉన్నారు.

సచివాలయ ఉద్యోగుల హర్షం

- బదిలీల ప్రక్రియ ప్రారంభం
- ఇతర జిల్లాలకు, భార్యా భర్తలు ఒకేచోట బదిలీకి అవకాశం
- జూన్ 3 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు



భీమవరం మున్సిపాలిటీలో బదిలీకి దరఖాస్తు చేసుకుంటున్న సచివాలయ ఉద్యోగులు

భీమవరం (ప్రకాశం చౌక్): సంక్షేమ ఫలాలు, పాలనా పరంగా సేవలను ప్రజలకు స్థానికంగా అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారు. యువతకు శాశ్వత ప్రభుత్వ ఉద్యోగులు కల్పించారు. ఉద్యోగాల్లో చేరి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా బదిలీల పక్రియను ప్రారంభించారు. బదిలీల్లో పలు సౌకర్యాలు కల్పించడంపై సచివాలయ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బదిలీల్లో సౌకర్యాలిలా..

సచివాలయ ఉద్యోగులు ప్రస్తుతం పనిచేస్తోన్న జిల్లా నుంచి అంతర్ జిల్లాకు (పరస్పర అంగీకారం) బదిలీ కావొచ్చు. భార్యా భర్తలు ఇద్దరు ఒకే చోటకు, మెడికల్ గ్రౌండ్స్ సింగిల్ ఉమెన్, విడో తదితర కేటగిరీల్లో బదిలీకి అవకాశం ఇచ్చారు. మే 31 నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. జూన్ 3 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. జూన్ 5 దరఖాస్తుల పరిశీలన, జూన్ 6న వెబ్ ర్యాంక్ జాబితా ప్రదర్శన, జూన్ 8, 9, 10 తేదీల్లో ఫిజికల్ కౌన్సిలింగ్, జూన్ 10 నుంచి ఫిర్యాదుల స్వీకరణ ఉంటుంది.

పశ్చిమగోదావరి జిల్లాలో..

గ్రామ, వార్డు సచివాలయాలు	535
ఉద్యోగులు	4,365 మంది

ఆనందంగా ఉంది



భార్యా భర్తలు ఇద్దరూ ఒకేచోటకు బదిలీ చేసుకునే అవకాశం కల్పించడం సంతోషం. నేను ప్రస్తుతం భీమవరం 14వ వార్డు అడ్మిన్‌గా పనిచేస్తున్నాను. ఇక్కడి నుంచి నా భర్త ఉద్యోగం చేస్తున్న తణుకుకు బదిలీకి దరఖాస్తు చేసుకున్నాను. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చి నిరుద్యోగులకు శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించడం, ఉద్యోగాల్లో పలు సౌకర్యాలు కల్పించడం ఆనందంగా ఉంది.

– ఎస్.వరలక్ష్మి, అడ్మిన్, 14వ వార్డు, భీమవరం

సొంత మండలానికి అవకాశం



ప్రభుత్వం సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో సొంత మండలానికి వెళ్లేందుకు అవకాశం ఇవ్వడం సంతోషం. నేను ప్రస్తుతం భీమవరం 7వ వార్డు ప్లానింగ్ సెక్రటరీగా పనిచేస్తున్నాను. ఇక్కడి నుంచి సొంత మండలమైన తాడేపల్లిగూడెంకు బదిలీకి దరఖాస్తు చేసుకున్నాను. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ ఉద్యోగులకు ఈ అవకాశం కల్పించడం పట్ల కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

– కె.రామ్‌కుమార్, ప్లానింగ్ సెక్రటరీ, 7వ వార్డు, భీమవరం

ఏసీబీ వలలో పంచాయతీ కార్యదర్శి

రూ.4 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం



ఏసీబీ అధికారులకు పట్టుబడిన పంచాయతీ కార్యదర్శి పార్థసారథి

పాలకొల్లు అర్బన్: కాంట్రాక్టర్ నుంచి పంచాయతీ కార్యదర్శి సీహెచ్‌వీఆర్ఎస్ఎస్ పార్థసారథి రూ.4 వేలు లంచం తీసుకుంటూ బుధవారం ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. అవినీతి నిరోధక శాఖ (ఏలూరు) ఇన్‌చార్జి డీఎస్పీ పి.శరత్‌బాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాలమూరులో 2021లో రూ.75 వేలు విలువైన శ్మశానం క్లీనింగ్ పనిని అదే గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ పంచదార వెంకట రంగారావు పూర్తిచేశారు. ఈ మేరకు బిల్లు చేయాలని ఇన్‌చార్జి కార్యదర్శిగా పనిచేస్తున్న పార్థసారథిని పలుమార్లు కాంట్రాక్టర్ రంగారావు అడుగుతున్నారు. రూ.15 వేలు లంచం ఇవ్వాలని, మొదటి విడతగా రూ.4 వేలు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో రంగారావు అవినీతి నిరోధక శాఖను ఆశ్రయించారు. బుధవారం సగంచెరువులో విధి నిర్వహణలో ఉన్న పార్థసారథికి రంగారావు రూ.4 వేలు లంచం ఇచ్చారు. ఆ వెంటనే ఏసీబీ అధికారులు దాడి చేసి పార్థసారథిని అదుపులోకి తీసుకుని రూ.4 వేలు స్వాధీనం చేసుకున్నారు. పంచాయతీ రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. గురువారం ఏసీబీ కోర్టు, రాజమండ్రిలో హాజరుపరుస్తామని డీఎస్పీ శరత్‌బాబు తెలిపారు. లంచం ఆశించే అధికారుల భరతం పట్టేందుకు టోల్ ఫ్రీ నెంబర్ 14400కు కాల్ చేయాలన్నారు. కాగా, పార్థసారథి సగంచెరువులో రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ పాలమూరు, వరిధనం, బల్లిపాడు గ్రామాలకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. అవినీతి నిరోధక శాఖ సీఐలు కె.ఏసుబాబు, ఎన్‌వీ భాస్కరరావు, జి.శ్రీనివాస్, కె.నాగేంద్రప్రసాద్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

యలమంచిలి: అప్పుల బాధ తాళలేక వడ్డిలంక గ్రామానికి చెందిన పోతురాజు వెంకట్రామయ్య (38) ఈ నెల 29న కలుపు మందు తాగాడాని, చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడని ఏఎస్సై ఎస్‌కే దుర్గారావు తెలిపారు. వెంకట్రామయ్యకు తల్లిదండ్రులు, భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మరదలు పెళ్లి కోసం 10 రోజుల క్రితం వెంకట్రామయ్య, అతని భార్య, పిల్లలు అత్తారింటికి దిరుసుమర్రు వెళ్లారు. భార్య, పిల్లలను అక్కడే వదిలి ఈ నెల 29న వెంకట్రామయ్య వడ్డిలంక వచ్చాడు. వెంకట్రామయ్యకు అధికంగా అప్పులు ఉండటంతో తీర్చే మార్గంలేక కలుపుమందు తాగాడు. దీనిని గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమచికిత్స అనంతరం భీమవరం తరలించారు. అక్కడి నుంచి ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి తీసుకెళ్లారు. వారు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేయడంతో అక్కడికి తీసుకెళుతుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. వెంకట్రామయ్య భార్య విక్టోరియా రాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై దుర్గారావు తెలిపారు.

తెలుగు సినీ పరిశ్రమకు గుర్తింపు తెచ్చిన సూపర్‌స్టార్ కృష్ణ

ఏలూరులో ఆయన విగ్రహాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే నాని



సూపర్ స్టార్ కృష్ణ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు (ఆర్ఆర్‌పేట): దివంగత సినీ హీరో, సూపర్‌స్టార్ కృష్ణ తెలుగు సినీ పరిశ్రమకు దేశ వ్యాప్తంగా గుర్తింపు తీసుకొచ్చారని ఎమ్మెల్యే ఆళ్ల నాని గుర్తుచేశారు. ఏలూరు నగరంలో ఏర్పాటు చేసిన కృష్ణ విగ్రహాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో నాని మాట్లాడుతూ తెలుగు సినీరంగంలో ఎంతో సాహసంతో కృష్ణ చేసిన ప్రయోగాలు దేశ సినీ రంగానికి మార్గదర్శకంగా నిలిచాయన్నారు. సినిమాల్లో నటిస్తూ కూడా ప్రజా సేవ చేయడం కృష్ణకే చెల్లిందన్నారు. కృష్ణ సేవా కార్యక్రమాలను ఆయన అభిమానులు కొనసాగించాలని సూచించారు. నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు మాట్లాడుతూ సూపర్‌స్టార్ కృష్ణ అభిమానుల కోరిక మేరకు ఆయన విగ్రహం ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించామన్నారు. ప్రముఖ నిర్మాత అంబికా కృష్ణ మాట్లాడుతూ హీరో కృష్ణ ఏడాదికి దాదాపు 14 నుంచి 18 సినిమాల్లో అవిశ్రాంతంగా నటిస్తూ పరిశ్రమలోని 24 శాఖల సాంకేతిక నిపుణులకు ఉపాధి కల్పించేవారని తెలిపారు. నేటి హీరోలు కూడా ఎక్కువ సినిమాలు చేస్తూ పరిశ్రమను బతికించాలని సూచించారు. మరో నిర్మాత, హీరో కృష్ణ బావ ఉప్పలపాటి సూర్యనారాయణ బాబు మాట్లాడుతూ రాష్ట్రంలోనే మొట్టమొదటగా హీరో కృష్ణ విగ్రహాన్ని ఏలూరు నగరంలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఉషా గ్రూప్ సంస్థల అధినేత వీవీ బాలకృష్ణారావు మాట్లాడుతూ హీరో కృష్ణ ఎంపీగా ఏలూరు నియోజకవర్గ ప్రజలకు విశేష సేవలు అందించారని తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు దిరిశాల వరప్రసాద్ మాట్లాడుతూ కృష్ణ జీవితంలో ఏలూరులోనే విద్యాభ్యాసం చేశారని, ఎంపీగా ఏలూరు ప్రజలతో ఆయనకు విడదీయరాని బంధం ఏర్పడిందన్నారు. అనంతరం సుమారు 3 వేల మందికి భోజన సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్, కార్పొరేటర్లు బండారు సునీత కిరణ్ కుమార్, గూడూరి ఆదిలక్ష్మీ ప్రసాద్, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి చౌదరి, కృష్ణ అభిమాన సంఘం ప్రతినిధి ఖాజా వలి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీ చించివేతపై ఫిర్యాదు



అత్తిలి పోలీస్ స్టేషన్‌లో ఎస్సైకు వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అత్తిలి: వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా అత్తిలి బస్‌స్టేషన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని చింపిన జనసేన పార్టీ కార్యకర్తలను అరెస్టు చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం రాత్రి ఎస్సై కేసీహెచ్ స్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మక్కా సూర్యనారాయణ మాట్లాడుతూ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించి నాలుగేళ్లు పూర్తవడంతో సీఎం జగన్, పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చిత్రాలతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని జనసేన నాయకులు, కార్యకర్తలు చింపడం దారుణమన్నారు. తొలుత అత్తిలి బస్‌స్టేషన్ సెంటర్‌లో ఫ్లెక్సీని చింపినవారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ మండల నాయకులు రాస్తారోకో చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గారపాటి నాగరాజు, కసిరెడ్డి బాలాజీ, ఆకుల చినబాబు, కంకటాల సతీష్, గంటా నాగరాజు, ఆకుల పండుస్వామి, కోరుకొల్లు వెంకట్రావు, యడ్లపల్లి దుర్గారావు, బొంతు దానయ్య తదితరులు పాల్గొన్నారు.

చెరువు చేపల పట్టుబడిపై ఉద్రిక్తత



కొత్తచెరువు వద్ద ఉద్రిక్తతను అడ్డుకుంటున్న పోలీసులు

ఆకివీడు: మండలంలోని రాజులపేట శివారు కొత్తచెరువు ప్రాంతంలో చేపల చెరువు వద్ద బుధవారం ఉద్రిక్తత నెలకొంది. గ్రామానికి చేర్చి కాళింగగూడెం పంచాయతీకి చెందిన 62 ఎకరాల రైతుల భూమిలో ఎనిమిదేళ్ల క్రితం చేపల చెరువు తవ్వారు. ఆ సమయంలో రైతులు, కొత్తచెరువు గ్రామస్తులు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందాన్ని అమలుచేయడంలేదని రెండేళ్ల క్రితం కొత్తచెరువు గ్రామస్తులు చెరువులోని చేపల్ని పట్టుకోనివ్వడంలేదు. దీంతో రైతులు హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు ఉత్తర్వుల మేరకు చెరువులో చేపల పట్టుబడిని బందోబస్తు మధ్య ప్రారంభించారు. దీన్ని గ్రామస్తులు అడ్డుకునేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని నిలువరించారు. ఈ నేపథ్యంలో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. చెరువు చేపల పట్టుబడి మరో రెండు రోజులుండే అవకాశం ఉందని డీఎస్పీ శ్రీనాథ్ చెప్పారు. ఉభయులూ అంగీకారానికి వస్తారని ఆశించినప్పటికీ ఫలితంరాలేదన్నారు. ఆకివీడు రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్సై కె.రాజారెడ్డి, పలువురు ఎస్సైలు, కానిస్టేబుళ్లు, ప్రత్యేక దళం పోలీసులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా వరాల వెంకన్న రథోత్సవం



ఈడూరులో వరాల వెంకటేశ్వరస్వామివారి రథోత్సవం, (ఇన్‌సెట్‌లో) విశేష అలంకరణలో శ్రీస్వామివారు

అత్తిలి: శ్రీదేవి, భూదేవి సమేత వరాల వెంకటేశ్వరస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం తీర్థ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, మేలుకొలుపు, తోమాల సేవ నిర్వహించారు. కోదండరామ భక్త సమాజం వారిచే భజన కాలక్షేపం, హరే శ్రీనివాస కోలాట భజన కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. పరిసర గ్రామాలనుంచి వేలాది మంది భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు భారీ అన్నసమారాధన నిర్వహించారు. మధ్యాహ్నం స్వామివారి రథోత్సవం నేత్రపర్వంగా సాగింది. బ్యాండు మేళాలు, తీన్‌మార్ డప్పులు, మంగళవాయిద్యాలు, చిత్రవిచిత్ర వేషధారణలతో ఏనుగు అంబారిపై స్వామి విశ్వరూప దర్శనంతో స్వామివారి రథోత్సవాన్ని గ్రామ వీధుల్లో నిర్వహించారు. ఆలయ అర్చకుడు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాధికాలను జరిపించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పెన్మెత్స ప్రభాకర కోటిరామలింగరాజు, ఈఓ పిల్లి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసుకు ఆదేశం



విద్యాశాఖాధికారులు మూసివేసిన వల్లూరులోని అక్షర స్కూల్

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : నిబంధనలకు విరుద్ధంగా విద్యాశాఖ అధికారులను బురిడీ కొట్టించి మూసివేసిన పాఠశాల పేరున నకిలీ ధ్రువీకరణ పత్రాలు సృష్టించి పాఠశాల నిర్వహిస్తున్న యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ ఆదేశాలు జారీ చేశారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట మండలం వల్లూరు గ్రామంలో అక్షర అప్పర్ ప్రైమరీ స్కూల్ యాజమాన్యం 2023 విద్యా సంవత్సరానికి హైస్కూల్‌ను ప్రారంభించడానికి 2017లో అనధికారికంగా మూసివేసిన సన్‌షైన్ స్కూల్ పేరుతో నకిలీ రిజిస్ట్రేషన్ పత్రాలు పుట్టించి, నకిలీ పోస్టల్ బాండ్స్, ఎడ్యుకేషన్ సొసైటీ, కరెస్పాండెంట్ పేరు మార్చుచేసి అక్షర ఉన్నత పాఠశాల యాజమాన్యం సన్‌షైన్ హైస్కూల్ పేరుతో అనుమతి పొందారు. నకిలీ ధ్రువీకరణ పత్రాలతో పాఠశాల నడుపుతోన్న విషయంపై కాకినాడలోని పాఠశాల విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ జి.నాగమణికి ఫిర్యాదు అందింది. దీనిపై ఆర్జేడీ సంబంధిత అధికారులను విచారణకు ఆదేశించారు. విచారణలో అక్షర పాఠశాల యాజమాన్యం విద్యాశాఖను మోసగించి తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో మూసివేసిన సన్‌షైన్ ఉన్నత పాఠశాల పేరున అనుమతి పొందారని నిర్ధారణ కావడంతో అక్షర స్కూల్‌ను మూసివేయడంతో పాటు కరస్పాండెంట్ వీవీ నాగలక్ష్మి, టీవీవీఎస్ మురళిలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పశ్చిమగోదావరి జిల్లా విద్యాశాఖాధికారిని ఆర్జేడీ ఆదేశించారు.

మహిళ దారుణ హత్య

నూజివీడు: స్థానిక ఎమ్మార్ అప్పారావు కాలనీలో మంగళవారం అర్ధరాత్రి మహిళ దారుణ హత్యకు గురైంది. గుంటూరు జిల్లా పెద్దకాకానికి చెందిన పిడపర్తి హైమావతి(28) భర్తను విడిచి ఎమ్మార్ అప్పారావు కాలనీకి ముగ్గురు పిల్లలతో వచ్చేసింది. గరికపాటి కోటయ్య అనే అతనితో గత ఐదేళ్లుగా సహజీవనం చేస్తోంది. వీరిద్దరి మధ్య ఏం గొడవ జరిగిందో తెలియదుకాని అర్ధరాత్రి సమయంలో వీరి ఇంట్లో నుంచి గొడవపడుతున్నట్టు కేకలు వినిపించాయి. తెల్లవారిన తరువాత హైమావతి చనిపోయిందని తెలుసుకున్న స్థానికులు లోపలికెళ్లి పరిశీలించారు. కర్రతో తలపై కొట్టడంతో చనిపోయినట్టు గుర్తించి పట్టణ సీఐ ఎంవీవీఎస్ఎన్ మూర్తికి సమాచారం అందించారు. సీఐ హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకొని వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టమ్ అనంతరం మృతదేహాన్ని హైమావతి బంధువులకు అప్పగించారు. కోటయ్యే హత్య చేసి ఉంటాడని అనుమానిస్తున్నారు.

శ్రీవారి క్షేత్రంలో శుభకార్యాల సందడి



అనివేటి మండపంలో పెళ్లి సందడి



అనివేటి మండపంలో నిర్వహిస్తున్న ఉపనయనం

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రం బుధవారం శుభకార్యాలతో సందడిగా మారింది. భక్తులతో కళకళలాడింది. ఉపనయనాలు, వివాహాలకు మంచి ముహూర్తాలు కావడంతో ఉదయం ఆలయ అనివేటి మండపంలో ఈ వేడుకలు నిర్వహించారు. దీనికి తోడు ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వేలాదిగా భక్తులు ఆలయానికి తరలివచ్చారు. కొత్త జంటలు, పెళ్లి జనాలు, ఉపనయనాలు నిర్వహించుకున్న వటువులు, వారి బంధువులతో పాటు, వేలాది మంది భక్తులతో ఆలయ పరిసరాలు కళకళలాడాయి. ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతం, అనివేటి మండపం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, కేశఖండనశాల తదితర విభాగాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. క్షేత్రంలో రాత్రి సైతం అధికంగా వివాహాలు జరిగాయి.

మద్యం తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

సాక్షి, భీమవరం: పాలకోడేరు మండలం శృంగవృక్షం రైల్వే గేటు వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా యానాం నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దర్ని అరెస్టు చేసినట్టు భీమవరం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) ఇన్‌స్పెక్టర్ వీవీవీఎస్ఎన్ వర్మ బుధవారం విలేకర్లకు తెలిపారు. కాళ్ల మండలం జువ్వలపాలెం గ్రామానికి చెందిన నేరేడుబిల్లి దుర్గా ప్రసాదు, ఆకివీడు మండలం దుంపగడప గ్రామానికి చెందిన మిద్దే నాగేంద్రబాబు చిన్నకారులో యానాం నుంచి సుంకం చెల్లించని మద్యం తరలిస్తుండగా అరెస్టు చేశామన్నారు. వారి నుంచి 360 బడ్వైజర్ టిన్ను బీర్లు, 24 రాయల్ స్టాగ్ ఫుల్ మద్యం సీసాలు, రెండు సెల్ ఫోన్లు, చిన్నకారు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని తెలిపారు. నిందితులను భీమవరం ఫస్ట్ ఏజేఎఫ్ సీఎం కోర్టులో హాజరు పర్చగా 14 రోజుల జుడీషియల్ రిమాండు విధించినట్టు వర్మ చెప్పారు. దాడుల్లో సీఐ కోటేశ్వర్, ఎస్సై ఎం.రామస్వామి, హెడ్ కానిస్టేబుల్స్ వై.ఆంజనేయులు, వీరవల్లి శ్రీనివాసరావు, కానిస్టేబుళ్లు వి.వెంకటేశ్వరరావు, బాలకృష్ణ, తాతరాజు, వీఆర్వో ఎం.భోగేశ్వరరావు పాల్గొన్నారని వివరించారు.

బ్రిడ్జి కోర్సు పరీక్షలకు 814 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా బ్రిడ్జి కోర్సు పరీక్షలు బుధవారం నిర్వహించారు. ఏలూరు, పశ్చిమ గోదావరి, తూర్పుగోదావరి జిల్లాల పరిధిలో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఏర్పాటు చేసిన 26 కేంద్రాల్లో 778 మందికి 459 మంది పరీక్షకు హాజరు కాగా 319 మంది గైర్హాజరయ్యారు. వీరిలో ఏలూరు జిల్లాలో 10 కేంద్రాల్లో 343 మంది విద్యార్థులకు 221 మంది హాజరు కాగా 122 మంది గైర్హాజరయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లాలో 11 కేంద్రాల్లో 286 మందికి 158 మంది హాజరు కాగా 128 మంది గైర్హాజరయ్యారు. తూర్పుగోదావరి జిల్లాలో 5 కేంద్రాల్లో 149 మందికి 80 మంది హాజరు కాగా 69 మంది గైర్హాజరయ్యారు.

ద్వితీయ సంవత్సరం పరీక్షలకు..

ఏలూరు జిల్లాలో 7 కేంద్రాల్లో 198 మందికి 134 మంది హాజరు కాగా 64 మంది గైర్హాజరయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లాలో 9 కేంద్రాల్లో 244 మందికి 171 మంది హాజరు కాగా 73 మంది గైర్హాజరయ్యారు. తూర్పుగోదావరి జిల్లాలో 5 కేంద్రాల్లో 68 మందికి 50 మంది హాజరు కాగా 18 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్మీడియట్ బ్రిడ్జి కోర్సు పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని, ఎక్కడా మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.చంద్రశేఖర బాబు తెలిపారు.

క్లుప్తంగా

కృష్ణపరమాత్మకు ప్రత్యేక పూజలు



తాడేపల్లిగూడెం (టీఓసీ): నిర్జల ఏకాదశి, జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి సందర్భంగా పట్టణంలోని రామచంద్రరావుపేటలోని కృష్ణయోగ ధ్యాన మందిరంలో బుధవారం కృష్ణ పరమాత్మకు పంచామృతాలతో అభిషేకాలు, సహస్రనామార్చనలు జరిగాయి. సామూహిక భగవద్గీత పారాయణం నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు మందిర కార్యదర్శి ఇందుకూరి మోహన్‌రాజు నేతృత్వం వహించారు.

నేత్రపర్వంగా వరాల వేంకటేశ్వరస్వామి కల్యాణం



అత్తిలి మండలం ఈడూరులో వరాల వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

అత్తిలి : ఈడూరు గ్రామంలో గల వరాల వేంకటేశ్వరస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి స్వామివారి కల్యాణం నేత్ర పర్వంగా జరిగింది. భీమవరం పట్టణానికి చెందిన పెన్మెత్స లక్ష్మీనరశింహరాజు, రామసత్యవతి దంపతులచే సమర్పించిన గజ వాహనంపై స్వామి, అమ్మవార్లను ఉంచి గజ వాహన సేవ నిర్వహించారు. అనంతరం సుదర్శనం సాయిరామాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు పర్యవేక్షణలో పలువురు వేదపండితులు మంత్రోచ్ఛారణల నడుమ స్వామివారి కల్యాణాన్ని జరిపించారు. దారాబత్తుల సత్యనారాయణ దంపతులచే స్వామివారికి మంగళసూత్రాలు సమర్పించగా, సమతం వెంకటేశ్వరరావు దంపతులు ముత్యాల తలంబ్రాలను అందజేశారు. పరిసర గ్రామాలనుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకించి, తరించారు.

శంకరమఠంలో వైభవంగా కుంభాభిషేకం



శంకరమఠంలో శంకరాచార్యులకు పూజలు చేస్తున్న గోవిందానంద సరస్వతి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని శంకర మఠంలో బుధవారం వైభవంగా కుంభాభిషేకం నిర్వహించారు. చంద్రమౌళీశ్వరస్వామి ఆలయ శిఖర ప్రతిష్ఠ మహోత్సవాలు సందర్భంగా మఠంలో ప్రత్యేక పూజలు జరిగాయి. శంకరాచార్యులకు అర్చనలు, సర్వమంగళ అమ్మవారికి కుంకుమ పూజలు, ఉమా మాహేశ్వరస్వామికి, యోగా లింగేశ్వర స్వామికి విశేష పూజలు జరిగాయి. పంపా క్షేత్రం పరమహంస గోవిందానంద సరస్వతి స్వామిజీచే భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. అనంతరం అఖండ అన్నసమారాధన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

ప్రతి ఒక్కరూ భక్తిభావంతో మెలగాలి

నరసాపురం రూరల్: భక్తిభావాన్ని పెంపొందించేందుకు దేవాలయాలు ఎంతగానో దోహదపడతాయని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు పేర్కొన్నారు. బుధవారం ఆయన మండలంలోని వేములదీవి వేంకటేశ్వర స్వామి వారి కల్యాణ మండపం ప్రారంభోత్సవం, ఎల్బీచర్లలోని పార్వతీ సోమేశ్వర స్వామివారి ఆలయ శంకుస్థాపన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. సుమారు 200 ఏళ్ల నాటి చరిత్ర కలిగిన సోమేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. అలాగే వేములదీవి వేంకటేశ్వర స్వామి వారి కల్యాణ మండపాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం పసలదీవి గ్రామంలోని వరసిద్ధి వినాయ స్వామి వారి ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమంలో కూడా ప్రసాదరాజు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆయన వెంట వైస్ ఎంపీపీ ఉంగరాల రమేష్, మండల అధ్యక్షులు దొంగ మురళీకృష్ణ, తిరుమాని నాగరాజు, గుబ్బల భాను, అయ్యారి కృష్ణ మోహన్, కంచర్ల రామకృష్ణ, సంగాని వడ్డికాసులు, బాబూరావు, గుబ్బల మోహనరావు, పులపర్తి త్రిమూర్తులు, కొట్టు ఏడుకొండలు, పులపర్తి రంగారావు, కొట్టు వెంకట్రావు, మామిడిశెట్టి శ్రీను, కాండ్రేగుల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

వికాసం, విజ్ఞానం కోసం విజ్ఞాన తరగతులు



అత్తిలి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న రిసోర్సుపర్సన్



వేల్పూరు గ్రంథాలయంలో చదరంగం ఆడుతున్న విద్యార్థులు



గూడెంలో గ్రంథాలయంలో నిర్వహించిన మ్యాజిక్ షో

తాడేపల్లిగూడెం (టీఓసీ): వేసవి విజ్ఞాన తరగతులు ఆసక్తిని, వికాసాన్ని, విజ్ఞానాన్ని పెంపొందిస్తాయని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్ బాబు పేర్కొన్నారు. పట్టణంలో గ్రేడ్ -1 శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి వానపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థినీ విద్యార్థులకు నిర్వహించిన 23వ రోజు వేసవి శిక్షణా శిబిరంలో జీవీఆర్ వంశీ, దేవేంద్రచే మ్యాజిక్ షో నిర్వహించారు. ప్రదర్శన విద్యార్థులను అలరించింది. ఎల్ఐసీ విశ్రాంత ఉద్యోగి గరికిపాటి బాపయ్య శర్మ, విశ్రాంత ఎంఈఓ ఎస్.సాల్మన్‌రాజులు విద్యార్థులకు పలు అంశాలు అవగాహన కల్పించారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పొగాకు, పొగాకు ఉత్పత్తులను వాడకాన్ని వదిలివేయాలని, పొగాకు వాడటం వల్ల వచ్చే అనర్థాలు గురించి చెప్పారు. అనంతరం దేశభక్తి గీతాలను విద్యార్థులకే బృందంగా ఆలపించారు.

గ్రంథాలయాల్లో ఉత్సాహంగా వేసవి శిక్షణా శిబిరాలు

తణుకు టౌన్: గ్రంథాలయాల ఆధ్వర్యంలో ప్రభుత్వం చేపట్టిన వేసవి శిక్షణ శిబిరాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. బుధ వారం తణుకు పట్టణంలో బ్యాంక్ కాలనీలో గల పురుషుల శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు కథల పుస్తకాలు చదవడం, విద్యార్థులతో కథలు చెప్పించడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. తణుకులోని మహిళా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు రిసోర్సు పర్సన్ పీ త్రిపుర సుందరి ఆధ్వర్యంలో అబాకస్ విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు చేతిరాత పోటీలు నిర్వహించారు. అనంతరం క్రాఫ్ట్ పేపర్‌తో బొమ్మలు తయారు చేసే విధానం, భగవద్గీత శ్లోకాలను నేర్పించడం, నీతి కథలు చెప్పించడం, కథలు చదవడం ఇంగ్లీష్ పదాలకు అర్థాలు చెప్పించడం వంటి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రచయిత్రి యర్రమిల్లి విజయలక్ష్మీ, రిసోర్సు పర్సన్ జే అలకనంద, గ్రంథాలయ అధికారి ఎస్ ప్రవీణ తదితరులు పాల్గొన్నారు. తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలోని జిల్లా గ్రంథాలయంలో జరిగిన వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు చదరంగం ఆటలో శిక్షణ ఇవ్వడంతో పాటు విద్యార్థులతో కథల పుస్తకాలు చదివించడం, పుస్తక సమీక్ష, ఇంగ్లీష్ పదాలకు అర్థాలు వివరణ, వంటి వాటితో పాటు కథలు చెప్పడం, యోగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈవో కోరా సత్యనారాయణ, రిటైర్డ్ ఏఈ కేఆర్ చక్రధరరావు, గ్రంథాలయ అధికారి వైవీ సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ ద్వారా విద్యార్థుల్లో బోధనా నైపుణ్యాలు పెంపొందుతాయి

అత్తిలి: వేసవి శిక్షణ శిబిరాల ద్వారా విద్యార్థుల్లో బోధనా నైపుణ్యాలు పెంపొందించుకోవచ్చని రిసోర్సుపర్సన్ ఎ వంశీ అన్నారు. అత్తిలి శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న శిబిరంలో బుధవారం విద్యార్థులకు పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలను ఆయన వివరించారు. కథలు రాయడం, మాట్లాడటం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని కె కోమలి, ఎం శ్రీదేవి, బి నాగేశ్వరరావు, బి పావని, ఎ బాలాజీ, గ్రంథాలయాధికారి డి కృష్ణారావు పాల్గొన్నారు.

భూముల విలువ పెంపు

- నేటి నుంచి అమల్లోకి రానున్న ధరలు
- తణుకు ప్రాంతంలో 20 నుంచి 30 శాతం పెంపు



తణుకు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

తణుకు : భూముల విలువలను ప్రభుత్వం పెంచుతూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు సంబంధించి స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఇప్పటికే రంగం సిద్ధం చేసింది. అయితే జగనన్న ఇళ్ల నిర్మాణాల పేరుతో పేదల కోసం ప్రభుత్వం భూములను సేకరించే ప్రాంతాల్లో మాత్రం పెంపునకు మినహాయింపు ఇచ్చింది. జూన్ 1 నుంచి కొత్త ధరలు అమల్లోకి రానున్నాయి. మరోవైపు భముల ధరలను పెంచుతున్న నేపథ్యంలో గత రెండు రోజులుగా సర్వర్లు మొరాయించడంతో బుధవారం ఒక్కరోజులో స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే వారితో తణుకులోని తణుకు, సజ్జాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు కిటకిటలాడాయి. చివరిరోజైన బుధవారం కూడా సర్వర్ మొరాయిస్తే స్టాంప్ డ్యూటీ పెరిగిపోయి రిజిస్ట్రేషన్ మరింత భారమవుతుందని భావించిన కొనుగోలు దారులు కార్యాలయాలకు బారులు తీరారు.

20 నుంచి 30 శాతం పెరుగుదల...

తణుకు, సజ్జాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో మొత్తం 40 గ్రామాలతోపాటు పట్టణంలోని 34 వార్డులు ఉన్నాయి. అయితే పూర్వపు ఉమ్మడి జిల్లా ప్రస్తుతం తూర్పుగోదావరి జిల్లాలో సైతం పలు గ్రామాలు తణుకు, సజ్జాపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాయాల పరిధిలో ఉన్నాయి. సజ్జాపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలోని తణుకు అర్బన్‌తోపాటు 27 గ్రామాలు ఉన్నాయి. వీటిలో తణుకు అర్బన్‌తోపాటు తణుకు, ఇరగవరం, పెరవలి, ఉండ్రాజవరం మండలాల పరిధిలో మండపాక, కె.ఇల్లిందలపర్రు, తూర్పువిప్పర్రు, కావలిపురం గ్రామాల్లో భూముల విలువ పెంచుతూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఆయా గ్రామాల్లో ఎకరం పొలం ధర రూ. 25 లక్షలు ఉంటే ప్రస్తుతం రూ. 32 లక్షలకు పెంచారు. గజం భూమి విలువ రూ. 5 వేల నుంచి రూ. 6,500 వరకు పెంచారు. పట్టణ పరిధిలోని గజం ధర గతంలో రూ. 11 వేలు నుంచి రూ. 30 వేలు ఉంటే ప్రస్తుతం రూ. 14 వేలు నుంచి రూ. 36 వేలకు పెంచారు. ఉండ్రాజవరం, వడ్లూరు, చివటం, సూర్యారావుపాలెం, ఖండవల్లి, ముక్కామల, తీపర్రు గ్రామాల్లో ఎకరం పొలం ధర రూ. 18 లక్షల నుంచి రూ. 24 లక్షలు ఉంటే ప్రస్తుతం రూ. 25 లక్షల నుంచి రూ. 32 లక్షలకు పెంచారు. గజం భూమి ధర రూ. రూ. 1800 నుంచి రూ. రూ. 2300 వరకు పెంచారు.

తణుకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో

తణుకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలోని మొత్తం 13 గ్రామాలు ఉన్నాయి. వీటిలో ఏడు గ్రామాల్లో భూముల విలువ పెంచుతూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. వేల్పూరు, కొమరవరం, తణుకు రూరల్, అర్బన్, తణుకు వేమవరం, ఉండ్రాజవరం, మోర్త, వెలగదుర్రు గ్రామాల్లో భూముల ధరలను పెంచారు. కొమరవరంలో ఎకరం భూమి ధర రూ. 32 లక్షల నుంచి రూ. 42 లక్షలకు పెంచారు. ఇక్కడ గజం ధర రూ. 2200 నుంచి రూ. 3,500 వరకు పెంచారు. తణుకులో గజం ధర రూ. 35 వేల నుంచి 42 వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఉండ్రాజవరంలో ఎకరం పొలం ధర రూ. 22 లక్షల నుంచి రూ. 28 లక్షలకు పెంచగా గజం భూమి ధర రూ. 2 వేల నుంచి రూ. 3 వేలకు పెంచారు.

ఘనంగా దేవాలయ, మండపాలకు శంకుస్థాపనలు



కె. పెంటపాడు గోపాలస్వామి ఆలయంలో నూతన కల్యాణ మండపానికి శంకుస్థాపన పూజలు నిర్వహిస్తున్న అర్చకులు త్రిలోచన దాసు తదితరులు

పెంటపాడు : మండలంలో ఉపముఖ్యమంత్రి, దేవాదాయశాఖామంత్రి కొట్టు సత్యనారాయణ ద్వారా అందిస్తున్న రూ. 2.50 కోట్ల నిధులతో ఆలయ, మండపాలకు శంకుస్థాపక పనులను బుధవారం ప్రారంభించారు. కె. పెంటపాడు గోపాలస్వామి ఆలయంలో కల్యాణ మండపం శంకుస్థాపన, వల్లూరుపల్లి విశ్వేశ్వరస్వామి నూతన ఆలయ నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమాలు బుధవారం ప్రత్యేక పూజలతో ప్రారంభించారు. ఈ సందర్భంగా రెండు ఆలయాల కార్యనిర్వహణాధికారి చీమలకొండ సాయి మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి, దేవాదాయ శాఖామంత్రి కొట్టు సత్యనారాయణ ద్వారా ఈ ఆలయాలకు రూ. 2.50 కోట్లు నిధులు అందించారన్నారు. కె. పెంటపాడు కల్యాణ మండపానికి రూ. 1 కోటి, వందేళ్ల పూర్తై శిథిలావస్థకు చేరిన వల్లూరుపల్లి విశ్వేశ్వరస్వామివారి ఆలయ నూతన నిర్మాణానికి రూ. 1.50 కోట్లు నిధులు అందించారన్నారు. ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆదేశాల మేరకు ఈ రెండు ఆలయాల పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు వినియోగంలోకి తీసుకొస్తామన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ దాసరి హైమావతి, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, సీనియర్ నాయకులు గుండుమోగుల సాంబయ్య, బొమ్మినాయుడు, మిరియాల శేషు, రాచర్ల సొసైటీ అధ్యక్షుడు కుంచే సుబ్రహ్మణ్యం, వల్లూరుపల్లి పెంటపాడు ఎంపీటీసీ సభ్యులు దెయ్యం శ్రీనివాసరావు, రెడ్డి సూరిబాబుతో పాటు, రెండు గ్రామాల సర్పంచ్‌లు పీతల సత్యనారాయణ, దంగేటి రామారావు, అర్చకులు త్రిలోచన దాస్, పూర్ణ, పూజ్యం గంగాధర శర్మ, వేమూరి దక్షిణామూర్తి, ప్రత్యేక పూజల చే సారు. ఆయా గ్రామాల ప్రముఖులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో కొండేపాడు కల్వర్టు

పొంచి ఉన్న తుఫాను ముప్పు



యనమదుర్రు డ్రెయిన్ నుంచి కొండేపాడు గ్రామంలోకి వరదనీరు రాకుండా ఉన్న శిథిలావస్థలో ఉన్న కల్వర్టు

పెంటపాడు: యనమదుర్రు డ్రెయిన్ కొండేపాడు కల్వర్టు శిథిలావస్థకు చేరింది. ఎంతో కాలం నుంచి ఈ కల్వర్టు మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో పాటు ఇక్కడ గట్టు కూడా బలహీనంగా ఉంది. ప్రతి ఏడూ వరద వస్తున్న సమయంలో గట్టు తెగకుండా కల్వర్టుకు సపోర్టుగా తాత్కాలికంగా ఇసుక బస్తాలు, మట్టి వేసి రైతులు తాత్కాలిక ఏర్పాట్లు చేసుకొంటున్నారు. అయితే ఈ ఏడు రెండో వైపు గోడకూడా కూలేందుకు సిద్ధంగా ఉండటంతో రైతులు బెంబేలెత్తుతున్నారు. ఫలితంగా ఈ ఏడు వర్షాకాలంలో తుఫాను వల్ల వచ్చే వరదనీటి వల్ల కల్వర్టు కూలి, కట్ట తెగితే గ్రామంలోకి వరదనీరు చొచ్చుకువచ్చే ప్రమాదం ఉంది. పంట నష్టంతో పాటు, ఆస్తినష్టం కలిగే అవకాశం ఉంది. దీంతో బి. కొండేపాడు గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. దువ్వ నుంచి మీనవల్లూరు వెళ్లే యనమదుర్రు డ్రెయిన్ పై పడమర గట్టు 9-0 మైలు వద్ద 1929లో బ్రిటీష్ కాలంలో నిర్మించిన ఈ కల్వర్టు ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. కొన్నేళ్ల క్రితం రైతులు చందాలు వేసుకొని మరమ్మతులు చేయించుకున్నారు. అయితే తక్షణమే ప్రభుత్వం నూతన కల్వర్టు నిర్మించాలని ఆ ప్రాంత రైతులు కోరుతున్నారు.

రజక విశ్రాంతి భవనాలకు మరమ్మతులు చేపట్టాలి



తాడేపల్లిగూడెం మండలంలో రజక చెరువులను పరిశీలిస్తున్న రజక సంక్షేమ సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు కట్లయ్య

తాడేపల్లిగూడెం రూరల్: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో నిర్మించిన సుమారు 200 రజక విశ్రాంతి భవనాలు శిథిలావస్థకు చేరాయని, వాటి మరమ్మతులకు గాను ఒక్కో భవనానికి రూ.3లక్షలు వంతున ఆరు కోట్లు విడుదల చేయాలని రజక సంక్షేమ సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరిజిల్లా అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని బంగారుగూడెం, అప్పారావుపేట, మాధవరం గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా బంగారుగూడెంలో రజకుల చెరువు వద్ద మోటారు బోరు కరెంటు కనెక్షన్ ఇప్పించాలని సర్పంచ్‌ను కోరారు. అలాగే, అప్పారావుపేట రజకులతో కలిసి శిథిలమైన విశ్రాంతి భవనాన్ని, చెరువును పరిశీలించారు. స్థానిక గంగుల చెరువును రజకులకు ఇప్పించడం జరిగిందన్నారు. మాధవరం గ్రామంలోని సుబేదారు చెరువుకు లీజు 21వేల నుంచి 71 వేలకు పెంచడం దారుణమన్నారు. దీనిపై ఈవోపీఆర్‌డీని, రగామ కార్యదర్శిని ప్రశ్నించగా త్వరలో పంచాయతీ తీర్మానం చేసి రజకులకు సహకరిస్తామని చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో వి.శ్రీనివాస్, అవిడి సత్యనారాయణ, టేకు ధనరాజు, పులిదిండి వెంకయ్య, కె.సుబ్బయ్య ఉన్నారు.

కుల వివక్ష... అంటరానితనం నేరం



తాడేపల్లిగూడెం మండలం కొమ్ముగూడెం ఎస్సీ కమ్యూనిటీ హాలులో మాట్లాడుతున్న డీటీ అనూరాధ

తాడేపల్లిగూడెం రూరల్: కుల వివక్ష, అంటరానితనం నేరమని డిప్యూటీ తహసీల్దార్ పి.అనూరాధ అన్నారు. బుధవారం మండలంలోని కొమ్ముగూడెం ఎస్సీ కమ్యూనిటీ హాలు వద్ద సివిల్ రైట్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీ అనూరాధ మాట్లాడుతూ కుల, మత భేదాలు లేకుండా అందరూ కలిసిమెలసి జీవించాలన్నారు. దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కళింగ లక్ష్మణరావు మాట్లాడుతూ నేటికి వివిధ రూపాల్లో కుల వివక్ష కొనసాగుతుందని, దీనిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కొమ్ముగూడెం సర్పంచ్ తాడేపల్లి బేబి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వి.నరేంద్ర, వీఆర్వో స్వామినాయుడు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ధూమపానం వద్దు.. జీవితమే ముద్దు



దూమపానంపై సచివాలయంలో అవగాహన కల్పిస్తున్న దేవి ఎడ్యుకేషనల్ సొసైటీ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ధూమపానం వద్దు, జీవితమే ముద్దు అని దేవి ఎడ్యుకేషనల్ సొసైటీ ఏఆర్‌సీఏ సైకాలజిస్టు టి.గంగాధర్ పేర్కొన్నారు. పట్టణంలోని బానిసల పునరావాస కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ టొబాకో దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ చెడు వ్యసానాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలన్నారు. కేంద్ర సామాజిక న్యాయసాధికారత మంత్రిత్వశాక సహకారంతో నిర్వహిస్తున్న డీ ఎడిక్షన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు అడ్మిన్ బి.రంగనాథ్, సొసైటీ కౌన్సిలర్ విష్ణులు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమం

పెంటపాడు: కార్మిక చట్టాలను ప్రస్తుత ప్రభుత్వాలు తుంగలోకి తొక్కుతున్నాయని, ఇలాంటి విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు కొనసాగిస్తామని ఏపీ వ్యవసాయ కార్మికసంఘ జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ పేర్కొన్నారు. బుధవారం ఆయన పెంటపాడు మండలం ముదునూరు గ్రామంలో రైతుసంఘ జిల్లా ఉపాధ్యక్షుడు చిర్ల పుల్లారెడ్డి, సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు సిరపరపు రంగారావులతో కలిసి ఉపాధి పనులు చేస్తున్న కూలీల దగ్గరకు వెళ్లి సమస్యలు తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ నేడు వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పుల ఫలితంగా కూలీలకు పనులు పూర్తిగా కనుమరుగు అయ్యాయన్నారు. ఉపాధి రంగం కూలీలకు కీలకంగా మారిందన్నారు. ఉపాధిలో తొలగించిన సౌకర్యాలను పునరుద్ధరించడంతో పాటు, జిల్లాకు భారీగా కేంద్రం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వడ్డి సత్యనారాయణ, చల్లా కాశీ విశ్వనాథ్, బుద్దన వెంకటలక్ష్మి, కాకరపర్తి దశరథుడు, మానుకొండ యాకోబు, కాకర భార్గవి, రామిశెట్టి రాఘవరాజు కాల గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

వీఓఏల సమస్యలు పరిష్కరించాలి

వీరవాసరం: గ్రామీణ ప్రాంతాలలో డ్వాక్రా గ్రూపుల్ని నడిపిస్తూ ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళుతున్న డ్వాక్రా యానిమేటర్ల సమస్యలు పరిష్కరించాలని నిరసన కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగా వీరవాసరంలో ఏపీఎంకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు జిల్లా నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో పి.రత్నకుమారి, రమణకుమారి, రాజేశ్వరి, మధులత, పుష్ప, శ్రీలక్ష్మీ చంద్రకళ, సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఐఏఎల్ జాతీయ మహాసభలు

సాక్షి, భీమవరం: భారత న్యాయవాదుల సంఘం(ఐఏఎల్) 11వ జాతీయ మహాసభలు జూన్ 2 నుంచి నాలుగు రోజుల పాటు కేరళ రాష్ట్రంలోని త్రివేండ్రం నిర్వహిస్తున్నట్లు ఐఏఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెల్లబోయిన రంగారావు చెప్పారు. బుధవారం భీమవరంలో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సభల్లో న్యాయవాదులపై జరుగుతున్న దాడుల నివారణకు ప్రత్యేకమైన చట్టం తేవాలని, న్యాయవాదులకు ఇళ్లస్థలాలు, వెల్ఫేర్ ఫండ్ రూ. 20 లక్షలకు పెంచాలని, జూనియర్ న్యాయవాదులకు స్టైఫండ్ రూ. 10వేలుకు పెంచాలని తదితర డిమాండ్స్‌పై చర్చించనున్నట్లు రంగరావు తెలిపారు. సమావేశంలో ఐఏఎల్ జిల్లా కార్యదర్శి నెక్కంటి క్రాంతికుమార్, బండి వెంకటేశ్వరరావు, చల్లా దానయ్యానాయుడు, వైవీ ఆనంద్, అశోక్ కుమార్, మల్లుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రభుత్వ ఆసుపత్రి ఏఆర్టీ సెంటర్లో రోగులకు పండ్లు, బిసినకర్రలు ఉచిత పంపిణీని బుధవారం జిల్లా సర్వోదయమండలి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఏపీ శాక్స్ డీడీ డాక్టర్ ఫ్లోరెన్స్ మాట్లాడుతూ రోగులను ఆదుకోవడం మానవ ధర్మమని మా వైద్య సేవలతో పాటు దాతలు ఇలా సహకరిస్తే రోగలకు ఉపశమనంగా ఉంటుందని దాతలను అభినందించారు. డాక్టర్ అల్లం రమేష్ , ఏఆర్టీ సెంటర్ డైరెక్టర్ ఎం.గోవిందబాబు మాట్లాడుతూ ప్రస్తుత వేసవిలో ఎండలు విపరీతంగా ఉన్నాయని ప్రజలు చాలా అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాంబాబు, జేడీసీ ఎస్టీ సుబ్రహ్మణ్యం, పీఈ పి.రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.